క్లుప్తంగా

జీపీ భవనానికి భూమిపూజ



సిరికొండ: వర్జన్ తండా జీపీలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి జెడ్పీటీసీ మాన్‌సింగ్ గురువారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లింగం, ఉపసర్పంచ్ సంతోష్, వీడీసీ సభ్యులు పెంటయ్య, దేవి, తూంపల్లి బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మహేందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు



ధర్పల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులను కల్పిస్తూ, కార్పొరేట్ స్థాయి విద్యను బోధిస్తున్నట్లు ఎంపీపీ సారిక హనుమంత్ రెడ్డి అన్నారు. డీబీ తండా, రేకులపల్లి ప్రభుత్వ పాఠశాలలకు రూ.2 లక్షల చొప్పున విలువైన సైన్స్, గణిత పరికరాలను ఎస్‌ఎఫ్‌సీ నిధుల నుంచి గురువారం అందజేశారు. సర్పంచులు నరేందర్, రాజేందర్, ఎంపీటీసీలు స్వామి, కరుణాకర్, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

తప్పిన పెను ప్రమాదం



సిరికొండ: మండల కేంద్రంలో కనగందుల రాములు ఇంటి పై భాగంలో స్వల్ప పిడుగుపాటు జరిగినట్లు స్థానికులు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఉరుములు మెరుపులతో వాతావరణం మేఘావృతంగా మారినట్లు తెలిపారు. పిడుగు పడినట్లు ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో ఇంటి బయటకు వచ్చి చూసేసరికి ఇంటి పై భాగానికి చెందిన సిమెంట్ పెచ్చులు ఊడి కింద పడ్డాయని స్థానికులు తెలిపారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ధర్పల్లి: గోవింద్‌పల్లి, డీబీ తండా, రేకులపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఎంపీపీ సారిక హనుమంత రెడ్డి ప్రారంభించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రైతులు ప్రభుత్వం సూచించిన నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ ధాన్యం విక్రయాలకు సహకరించాలని కోరారు. సొసైటీ చైర్మన్ చిన్నారెడ్డి పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం..

జక్రాన్‌పల్లి: సికింద్రాపూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ కుంచాల విమల రాజు గురువారం ప్రారంభించారు. సర్పంచ్ తలారి గంగామణి, ఉపసర్పంచ్ గంగామణి, మాజీ ఉపసర్పంచ్ అప్పాల అరుణ్, వైద్యాధికారిణి నయన, సూపర్‌వైజర్లు ధనలక్ష్మీ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

ఖలీల్‌వాడి: నగరంలోని నాందేవ్‌వాడకు చెందిన మరాఠీ యువజన సంఘం సభ్యులు గురువారం మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ చేపట్టిన హాథ్‌సే హాథ్ జోడో యాత్ర, పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి చేపట్టిన యాత్రలకు యువకులు ఆకర్షితులవుతున్నారని అనినారు. అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుదన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

నిజామాబాద్ అర్బన్: గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్మెంట్ సెల్ సంయుక్తంగా నిర్వహించే సర్టిఫికెట్ కోర్స్ కరపత్రాన్ని కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సర్టిఫికెట్ కోర్సులో అన్ని విభాగాల విద్యార్థులు పాల్గొనవచ్చునని తెలిపారు. వ్యవస్థాపన నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి ఈ సర్టిఫికెట్ కోర్సు ఉపయోగపడుతుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ రఫీ పాల్గొన్నారు .

బాలుడి అదృశ్యం

ఖలీల్‌వాడి : నగరంలోని నాందేవ్‌వాడకు చెందిన పటివార్ నాగేశ్ అనే బాలుడు అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. గురువారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన బాలుడు తిరిగి రాలేదు. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో నాగేశ్ తండ్రి రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సంస్కృతంపై అవగాహన ఉండాలి

నిజామాబాద్ సిటీ: ప్రతి ఒక్కరూ సంస్కృతంపై అవగాహన కలిగి ఉండాలనీ సంస్కృత భారతి తెలంగాణ నిర్వహకులు మోహన్ అన్నారు. నగరంలోని కోటగల్లీ పద్మశాలి భవనంలో 10 రోజుల పాటు సంస్కృత భాషపై కార్యక్రమాన్ని నిర్వహించగా గురువారం రాత్రి ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ.. సంస్కృత భాష అనేది పుట్టుకతోనే ఉందని, అంతరించిపోతున్న ఈ భాషకు మళ్లీ జీవం పోయాలన్నారు. 10 రోజుల పాటు విద్యార్థులకు పాఠాలు బోధించిన అధ్యాపకురాలు స్వరూప బెహన్‌ను పలువురు అభినందించారు.

యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

- సిరికొండ మండల కేంద్రంలో అనుమతుల్లేకుండా నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు



ఫంక్షన్ హాల్

సిరికొండ: మండల కేంద్రంలో తెలంగాణ చౌరస్తా అనేది ప్రధాన చౌరస్తా. ఈ చౌరస్తాకు ఒక వైపు సిరికొండ మండల కేంద్రం పరిధిలోకి వస్తే మరో వైపు మైలారం శివారులోకి వస్తుంది. మండల కేంద్రంలో ఈ చౌరస్తానే వ్యాపార సముదాయాలకు నెలవుగా ఉంది. మైలారం రెవెన్యూ శివారు మండల కేంద్రానికి ఆనుకొని ఉండటంతో వాణిజ్య భవనాల నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయి. వ్యాపార సముదాయాల పేరిట భవన నిర్మాణాలకు గ్రామ పంచాయతీ నుంచి అనుమతి తీసుకోవాలంటే గ్రామ పంచాయతీకి ఎక్కువ మొత్తంలో ఫీజు చెల్లించాల్సి వస్తుండటంతో భవన నిర్మాణదారులు అడ్డదారులు తొక్కుతున్నారు. వీరికి జీపీ సిబ్బంది, అధికారుల అండదండలు తోడవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ప్రస్తుతం మైలారం రెవెన్యూ పరిధిలో జరుగుతున్న వ్యాపార సముదాయాల నిర్మాణాల్లో ఇదే తంతు కొనసాగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఏకంగా ఫంక్షన్ హాల్ నిర్మించేశారు

మైలారం రెవెన్యూ శివారు పరిధిలోనే మరో అక్రమ నిర్మాణం పూర్తయింది. గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే ఏకంగా ఫంక్షన్ హాల్ నిర్మించారు. ఇప్పటి వరకు అందులో ఇరవైకి పైగానే ఫంక్షన్‌లు జరిగాయి. అనుమతి కోసం వచ్చి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తామని చెప్పి వెళ్లారని ఇప్పటి వరకు దరఖాస్తు చేయలేదని గ్రామ పంచాయతీ కార్యదర్శి నిఖిత తెలిపారు. అనుమతి తీసుకోవాలని రెండు సార్లు నోటీసులు ఇచ్చామని ఆమె తెలిపారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నా పట్టించుకోవాల్సిన అధికారులు మౌనంగా ఉండటం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇల్లు పేరిట అనుమతి.. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం



మైలారం రెవెన్యు శివారు పరిధిలో దొండ్ల వాగు పక్కన ఒక వ్యాపారి 20 మడిగెలు నిర్మించాడు. గ్రామ పంచాయతీ నుంచి ఇల్లు నిర్మాణం పేరిట అనుమతి పొందాడు. ఈ మడిగెలకు గ్రామ పంచాయతీ వారు శివసారి జనార్దన్ పేరిట 4–22 ఇంటి నెంబర్, శివసారి లక్ష్మీ ఇంటి నెంబర్ 4–23 జారీ చేశారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో 20 మడిగెల నిర్మాణానికి అనుమతి కోసం ఒక్కో ఇంటి నెంబర్ పేరిట 179.50 చదరపు మీటర్ల స్థలానికి కేవలం రూ.7,484 మాత్రమే ఫీజు చెల్లించారు. వ్యాపారి గ్రామ పంచాయతీకి మడిగెలు అని తెలపకుండా ఒక గది ఒక కిచెన్ గది అని బ్లూప్రింట్‌లో పటం తయారు చేయించి ఇచ్చి అనుమతులు పొందాడు. ఇల్లు నిర్మాణం పేరిట అనుమతులు తీసుకొని వ్యాపార సముదాయం నిర్మించినప్పటికి గ్రామ పంచాయతీ వారు కాని మండల పరిషత్ అధికారులు కాని ఎలాంటి అభ్యంతరం తెలపకపోవడం విశేషం. మండల కేంద్రం నుంచి భీంగల్ వైపు వెళ్లే మార్గంలో ప్రధాన రహదారి పక్కనే ఈ మడిగెలను నిర్మించినప్పటికి అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలున్నాయి. ఇసుకను కూడా అక్రమంగా పక్కనే ఉన్న వాగు నుంచి వినియోగించినట్లు సమాచారం. ఈ వ్యాపార సముదాయ స్థలానికి కేవలం రెవెన్యు శాఖ ద్వారా నాలా కన్వర్షన్ చేయించి, నిర్మాణం కోసం డీటీసీపీకి దరఖాస్తు చేయలేదని తెలిసింది.

విచారణ జరిపిస్తాం

మైలారం శివారులో ఇల్లు నిర్మాణం పేరిట అనుమతి తీసుకొని మడిగెలు నిర్మించడంపై విచారణ జరుపుతాం. అనుమతుల్లో తప్పుదోవ పట్టించినందుకు శాఖాపరంగా ఆయనపై చర్యలు తీసుకుంటాం. డీటీసీపీకి ఫిర్యాదు చేయమని పంచాయతీ కార్యదర్శికి ఆదేశిస్తాం. వారు తనిఖీలు చేసి తగిన చర్యలు తీసుకుంటారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన ఫంక్షన్ హాల్‌ను మూసి వేయాలని ఆదేశాలు జారీ చేస్తాం.

– లక్ష్మీప్రసాద్ ఎంపీడీవో

మతసామరస్యం వెల్లివిరిసేలా రంజాన్ వేడుకలు



కానుకలు, చెక్కులు అందిస్తున్న బాజిరెడ్డి జగన్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): తెలంగాణ రాష్ట్రంలో మత సామరస్యం వెల్లివిరిసే విధంగా రంజాన్ వేడుకలు నిర్వహించుకుంటున్నామని ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ అన్నారు. ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆదేశాల మేరకు గురువారం రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రంజాన్ గిఫ్ట్ ప్యాక్‌లను బాజిరెడ్డి జగన్ అందజేశారు. అలాగే డిచ్‌పల్లి మండలానికి చెందిన 25 మంది లబ్ధిదారులకు షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, డిచ్‌పల్లి జెడ్పీటీసీ దాసరి ఇందిర పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లిలో..

జక్రాన్‌పల్లి: బ్రాహ్మణ్‌పల్లిలో రంజాన్ కానుకలను సర్పంచ్ మాదరి లత గురువారం పంపిణీ చేశారు. ఉపసర్పంచ్ సుప్రియ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పోతే రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇందల్వాయి తహసీల్‌లో..

ఇందల్వాయి: స్థానిక తహసీల్ కార్యాలయంలో 200 మందికి రంజాన్ కానుకలను ఎంపీపీ రమేష్ నాయక్, తహసీల్దార్ రోజాతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చింతల దాసు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చెలివేరి దాసు, కో–ఆప్షన్ మెంబర్ హుస్సేన్ పాల్గొన్నారు.

నగరంలోని 40వ డివిజన్‌లో..

నిజామాబాద్‌నాగారం: నగరంలోని 40వ డివిజన్‌లో రంజాన్ కానుకలను స్థానిక కార్పొరేటర్ శివచరణ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

సనాతన వీరశైవ ధర్మాన్ని ఆచరించాలి

- విశ్వశాంతి, లోక కల్యాణార్థమే అఖండ శివనామ సప్తాహ సంకల్పం
- మహారాష్ట్ర ప్రాంత బార్సీ మఠాధిపతి మణికంఠ శివాచార్య మహరాజ్
- బోధన్ ఏకచక్రేశ్వరాలయంలో 18వ అఖండ శివనామ సప్తాహం ప్రారంభం

బోధన్: ఎన్నో విశిష్టతలు కలిగి ఉన్న వీరశైవ ధర్మాన్ని ఆచరించాలని మహారాష్ట్ర ప్రాంత బార్సీ మఠాధిపతి బ్రహ్మ గురుసిద్ధ మణికంఠ శివాచార్య మహరాజ్ ప్రబోధించారు. ప్రతి ఒక్కరూ స్వధర్మ నిష్టను పాటిస్తూనే ఇతర ధర్మాలను గౌరవించాలన్నారు. మానవ సమతా ధర్మం విజయ మార్గంలో నడవాలని వీరశైవ ధర్మం ఆకాంక్షిస్తోందని జగద్గురువులు ఉపదేశాలు అందించారని పేర్కొన్నారు. వర్తమానకాలంలో జీవనశైలిలో వచ్చిన మార్పుల కారణంగా తాత్కాలిక, క్షణిక సుఖాల ఉచ్చులో పడి సంప్రదాయాలు, ధర్మాన్ని విస్మరిస్తున్నారని, ఈ మార్గం వ్యక్తులు, సమాజానికి ఏమాత్రం శ్రేయస్కరం కాదన్నారు. అఖండ శివనామ సప్తాహం సంప్రదాయ పరంపర విశ్వ శాంతి, లోక కల్యాణార్థం కోసం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.బోధన్ పట్టణంలోని పురాతన ఏకచక్రేశ్వ రాలయం (శివాలయం)లో వీరశైవ సమాజ్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 18వ అఖండ శివనామ సప్తాహం, పరమ రహస్య గ్రంథపారాయణ మహోత్సవాన్ని గురువారం మఠాధిపతి చేతులమీదుగా ప్రారంభించారు. అనంతరం భక్తులనుద్దేశించి ప్రవచనాలు చేశారు. భక్తులు మఠాధిపతికి పాద పూజ చేశారు.

ఏడు రోజుల పాటు సప్తాహం

సప్తాహం ఈ నెల 27 వరకు కొనసాగనుంది. ప్రతి రోజు ఉదయం 5 నుంచి 6 గంటల వరకు శివ పారాయణం, 8 నుంచి 11 గంటల వరకు వీరశైవుల ఆరాధ్య గ్రంథం పరమ రహస్య గ్రంథపారాయణం ఉంటుంది. మధ్యాహ్నం, రాత్రి వేళల్లో పెద్ద ఎత్తున అన్నదానం, రాత్రి 9 నుంచి 11 గంటల వరకు శివకీర్తనలు, భజన కార్యక్రమాలు ఉంటాయి.

ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వండి

అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు, సొంత స్థలాలున్న వారికి రూ.10 లక్షలు ఇవ్వాలని, నిరుద్యోగులకు రూ.10 వేల భృతి, దరఖాస్తుదారులకు కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయాలని తదితర డిమాండ్లతో సీపీఐఎంఎల్ ప్రజాపంథా నాయకులు అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో గురువారం ధర్నాలు నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ర్యాలీలు, ఆందోళనలు చేశారు. అనంతరం స్థానిక అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు నిరసనగా ప్రతి ఒక్కరు ఉద్యమించాలన్నారు. – సాక్షి నెట్‌వర్క్



నిజామాబాద్ ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐఎంఎల్ ప్రజాపంథా నేతలు



డిచ్‌పల్లి తహసీల్ కార్యాలయం వద్ద ధర్నా..



సిరికొండ తహసీల్ కార్యాలయం ఎదుట..

త్వరలో పెట్రోల్ బంక్ పనులు ప్రారంభం

– ఆర్టీసీ ఆర్‌ఎం ఉషాదేవి



డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న పెట్రోల్ బంక్ నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని నిజామాబాద్ ఆర్‌ఎం ఉషాదేవి తెలిపారు. గురువారం ఉదయం డిచ్‌పల్లి బస్టాండ్‌ను సందర్శించిన ఆర్‌ఎం ఉషాదేవి, డిపో –1 మేనేజర్ ఆనంద్‌తో కలిసి పెట్రోల్ బంక్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బస్టాండ్ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తామన్నారు. ఆర్‌ఎం వెంట ఎంక్వైరీ సీఐ దినేష్, డీఐ రాంబాబు ఉన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

ఇందల్వాయి: వారం రోజులుగా గన్నారం అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. అగ్నిమాపక కేంద్రం పరిధిలోని గ్రామాల ప్రజలకు అగ్ని ప్రమాదాలపై ఫైర్ సిబ్బంది వివరంగా అవగాహన కల్పించారని అగ్నిమాపక కేంద్ర అధికారి కాంతారావు తెలిపారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు సేవలు ఉపయోగించుకోవాలన్నారు.

స్వచ్ఛ భారత్ మిషన్‌పై శిక్షణ తరగతులు



తరగతులకు హాజరైన సిబ్బంది

జక్రాన్‌పల్లి: స్వచ్ఛ భారత్ గ్రామీణ మిషన్ ఫేజ్–2లో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 2 రోజుల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ కార్యక్రమానికి బాల్కొండ ఎంపీడీవో సంతోష్ మాస్టర్ ట్రైనర్‌గా విచ్చేసి స్వచ్ఛ భారత్ మిషన్‌పై అవగాహన కల్పించారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ఆయా గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం, మరుగుదొడ్లు, తడి చెత్త, పొడి చెత్త, ప్లాస్టిక్ నిషేధం వంటి కార్యక్రమాలు చేపట్టారు. వీటిపై పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, మహిళా సంఘం అధ్యక్షులు, సీఏలకు శిక్షణ నిచ్చారు. ఎస్‌బీఎం కో–ఆర్డినేటర్ రాజు, రిసోర్స్ పర్సన్ రాంబాబు, ఎంపీడీవో లక్ష్మణ్, ఎంపీవో భరత్, ఏపీవో రవి, సర్పంచ్‌లు సాయరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు గంగారెడ్డి పాల్గొన్నారు.

పెంకుటిల్లుకు వెలుగులు వచ్చాయి

- సాక్షి కథనానికి అధికారుల స్పందన

నిజామాబాద్‌నాగారం: సాక్షిలో గురువారం 'పెంకుటిల్లుకు రూ. 53,745 కరెంట్‌బిల్లు' అనే శీర్షికన కథనం వచ్చింది. దీనిపై నిజామాబాద్ రూరల్ డీఈ ఉత్తమ్ స్పందించారు. వెంటనే రూరల్ అకౌంట్ ఆఫీసర్ విజయ్‌తో పాటు సిబ్బంది మోపాల్ మండలంలోని మంచిప్ప గ్రామంలోని సాయిలు ఇంటికి వెళ్లారు. మీటర్‌ను తనిఖీ చేశారు. బిల్లు సక్రమంగానే వచ్చిందని, అయితే రీడింగ్ కొన్ని సంవత్సరాలుగా తీయకపోవడంతో ఒక్కసారిగా రూ. 53,745 వచ్చిందని అధికారులు నిర్ధారించారు. వెంటనే విద్యుత్ సరఫరాకు ఆదేశాలు ఇచ్చారు. బిల్లు విషయంలో జరిగిన తప్పిదాన్ని వెలుగోలుకి తెచ్చిన 'సాక్షి'కి సాయిలు కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు.



సాయిలు ఇంటిలో విద్యుత్ వెలుగులు

గ్రంథాలయంలో సమస్యలు పరిష్కరించండి

సుభాష్‌నగర్: కంఠేశ్వర్‌లోని ప్రాంతీయ గ్రంథాలయంలో సమస్యలు పరిష్కరించి, మౌలిక వసతులు కల్పించాలని ఎస్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వరదబట్టు వేణురాజ్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం కలెక్టరేట్‌లోని ఏఓ ప్రశాంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వేణురాజ్ మాట్లాడుతూ.. ప్రాంతీయ గ్రంథాలయంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు, నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మూడు గదులు ఖాళీగా ఉన్నప్పటికీ వాటికి తాళాలు వేసి ఉంచుతున్నారని, తద్వారా విద్యార్థులు, నిరుద్యోగులకు కూర్చునేందుకు స్థలం లేక చెట్ల కింద చదువుకుంటున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. సరిపడా ఫర్నిచర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పోటీ పరీక్షల పుస్తకాలు లేవని, నూతన సిలబస్‌తో గ్రంథాలయంలో అందుబాటులో ఉంచాలన్నారు. గ్రంథాలయ పనివేళలు పెంచాలని కోరారు. తాగునీరు, వైఫై ఏర్పాటు చేయాలని, కలెక్టర్, గ్రంథాలయ శాఖాధికారి వెంటనే సందర్శించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేకుంటే విద్యార్థులు, నిరుద్యోగులతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. నాయకులు నిఖిల్ రెడ్డి, సతీష్, బుచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పిచ్చి మొక్కల తొలగింపు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం ఖానాపూర్(ఒకటో డివిజన్)లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు, ట్రాన్స్‌ఫార్మర్‌పైకి పాకుతున్న మొక్కల తీగలు వార్తను అటెన్షన్ ప్లీజ్‌లో ప్రచురించగా విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే వాటిని తొలగించారు. దాంతో అక్కడి పరిసరాలు శుభ్రంగా మారటమే కాకుండా ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం తొలగిపోయింది. ఈ వార్తను ప్రచురించిన సాక్షి దినపత్రికకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



సాక్షి ఎఫెక్ట్..

సమాచారం..

23న ఇతిహాస సంకలన సమితి

నిజామాబాద్ సిటీ: దేశ చరిత్ర అధ్యయనం పట్ల ఆసక్తి గల వారికి ఈ నెలా 23న ఇతిహాస సంకలన సమితి జిల్లాస్థాయి అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఇతిహాస సంకలన సమితి నిర్వాహకులు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమం నగరంలోని కోటగల్లి ఆర్యసమాజ్‌లో ఉదయం 10.30 గంటలు ఉంటుందని, సదస్సుకు వచ్చేవారికి మధ్యాహ్న భోజన వసతి ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	61,300	వెండి (కిలో)	74,300
22 క్యారెట్స్	56,517	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	క్యాప్సికం	40	60
బెండకాయ	30	50	గాజరుగడ్డ	15	30
బీరకాయ	30	50	పచ్చిమిర్చి	30	50
దొండకాయ	20	40	దోసకాయ	15	30
జిల్కసుకాయ	60	80	ఆలుగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిగడ్డ	10	20
వంకాయ	15	30	గోబిపువ్వు	20	40
పాలకూర	20	40	బీట్‌రూట్	20	40
మెంతికూర	50	70	గోరుచిక్కుడు	50	70
కొత్తిమీర	35	60	చిక్కుడుకాయ	30	50
పుదీనా	20	40			

– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సెడ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏపియన్)
స్క్రీన్–1– విరూపాక్ష – 10.20, 1.25, 4.30, 7.35, 10.35
స్క్రీన్–2– దసరా – 1.35
ఈవిల్ డెడ్ రైజ్ (ఇంగ్లీష్) 4.35, 10.25
శాకుంతలం – 7.25
స్క్రీన్–3– కిసి కా భాయ్ కిసి కీ జాన్ (హిందీ) 10.45, 1.40, 4.25, 7.30, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
స్క్రీన్–1– కిసి కా భాయ్ కిసి కీ జాన్ (హిందీ) 10.05, 1.15, 4.25, 7.35, 10.45
స్క్రీన్–2– విరూపాక్ష –9.55, 1.00, 4.05, 7.10
కిసి కా భాయ్ కిసి కీ జాన్ (హిందీ) 10.15
స్క్రీన్–3– కిసి కా భాయ్ కిసి కీ జాన్ (హిందీ) 10.40
విడుదల పార్ట్–1 – 1.50; ఈవిల్‌డెడ్ రైజ్ (ఇంగ్లీష్) – 8,10; విరూపాక్ష – 10.30
స్క్రీన్–4– ఈవిల్‌డెడ్ రైజ్ (ఇంగ్లీష్) – 11.10, 10.05(రాత్రి)
శాకుంతలం – 1.30; దసరా – 4.35; హలో మీరా – 7.50

దేవి – రావణాసుర
నటరాజ్ – కిసి కా భాయ్–కిసి కీ జాన్(హిందీ)
లలితామహల్ – దసరా
విజయ్ – విరూపాక్ష

ఒగ్గు కళాకారుడు మల్లయ్య మార్గంలో నడవాలి

ఖలీల్‌వాడి: ఒగ్గు కళాకారుడు, ఏఐకెఎంఎస్ డివిజన్ నాయకుడు గోపూర్ మల్లయ్య మార్గంలో నడిచినప్పుడే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య అన్నారు. నగరంలోని అర్సపల్లిలో గోపూర్ మల్లయ్య 2వ వర్ధంతి సందర్భంగా నూతన పార్టీ ఆఫీస్‌లో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో నిజాం సాగర్ ఆయకట్టు రక్షణ పోరాటంలో మల్లయ్య ముందున్నారని, చెరుకు రైతుల సమస్యల పోరాడారని తెలిపారు. ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు నాయక్వాడ్ నర్సయ్య, చెగంటి గంగాధర్, రాజన్న, మల్లయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



చిత్రపటానికి పూలమాల వేస్తున్న నేతలు

వైకుంఠధామాల్లో పనులు త్వరగా పూర్తి చేయండి

– ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా ఆదేశం



నిజామాబాద్‌నాగారం: ఆధునిక సదుపాయాలతో నిర్మిస్తున్న వైకుంఠధామాల్లో పనులు త్వరగా పూర్తి చేయాలని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం అర్సపల్లి, దుబ్బలో నిర్మాణంలో ఉన్న వైకుంఠధామాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లని ఆదేశించారు. వైకుంఠధామాలలో చెట్లు పెంచాలని, వాటి నిర్వహణ కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.